విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో తొవ్వ దినపత్రిక లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

జిల్లా బ్యూరో చీఫ్‌లు　జిల్లా స్టాఫ్ రిపోర్టర్‌లు

నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు　మండల రిపోర్టర్‌లు

సంప్రదించవలసిన ఫోన్ నెంబరు :

8328649322, 9398236146.



# తొవ్వ

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

సంపుటి : 1 | సంచిక : 314 | బుధవారం 18-06-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 2 | వెల : 5 రూ/.


## హైదరాబాద్ ఎయిర్ పోర్టు రికార్డు

**గత నెల 27.91 లక్షల మంది ప్రయాణికులు**

**పురోగతిలో ఢిల్లీ విమానాశ్రయం కంటే ముందంజ**

**రంగారెడ్డి :** హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సరికొత్త రికార్డు సృష్టించింది. ఎయిర్‌పోర్టు ప్రారంభమైన తర్వాత గత నెల అత్యధిక మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. ప్రయాణికుల పురోగతిలో ఢిల్లీ కంటే హైదరాబాద్ విమానాశ్రయం ముందంజలో ఉంది. హైదరాబాద్ ఎయిర్‌పోర్టు నిర్వాహణ సంస్థ జీఎంఆర్ మంగళవారం తమ ఆధ్వర్యంలో నడుస్తున్న ఐదు విమానాశ్రాయలకు సంబంధించి మే నెలలో పురోగతిపై ఓ ప్రకటనను విడుదల చేసింది. గత నెల ఐదు విమానాశ్రయాల నుంచి కోటి మంది ప్రయాణికులు రాకపోకలు సాగించినట్లు జీఎంఆర్ సంస్థ వెల్లడించింది. ఏప్రిల్ నెలతో పోలిస్తే మే నెలలో జీఎంఆర్ విమానాశ్రాయాల్లో సగటు ప్రయాణికుల పురోగతి 0.8శాతంగా ఉంది. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం అత్యధికంగా 15.3% పురోగతి నమోదైంది.

# యుద్ధంలోకి అమెరికా

- ఖమేనీ ఎక్కడ దాక్కున్నారో మాకు పక్కాగా తెలుసు: ట్రంప్
- ప్రస్తుతానికి హతమార్చం.. ఇరాన్ లొంగిపోవాలి
- ఆ దేశం వద్ద అణ్వాయుధం అనేది ఉండకూడదు
- సమస్యకు నిజమైన ముగింపు కోరుకుంటున్నాం
- టెహ్రాన్‌ను అక్కడి పౌరులు తక్షణం వీడి వెళ్లిపోవాలి
- ట్రంప్ హెచ్చరికలు.. జీ7నుంచి అర్ధంతరంగా అమెరికాకు
- తాను తిరిగి వెళుతున్నది కాల్పుల విరమణ ఒప్పందం
- కోసం కాదని.. విషయం అంతకంటే పెద్దదని స్పష్టీకరణ
- ఈశాన్య సిరియా నుంచి అమెరికా బలగాల తరలింపు!
- డీగో గార్షియాలో ఇప్పటికే అమెరికా బీ2 స్టెల్త్ బాంబర్లు





**టెహ్రాన్, టెల్అవీవ్, జూన్ 17:** పతాకస్థాయికి చేరిన ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంలో.. అమెరికా కూడా జోక్యం చేసుకోనుందా? ఇజ్రాయెల్‌కు తోడుగా యుద్ధరంగంలోకి దిగనుందా? గడిచిన 24 గంటలుగా శరవేగంగా జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే ఈ ప్రశ్నలకు అవుననే సమాధానమే వస్తోంది. ఎన్నిసార్లు హెచ్చరించినా తమతో అణు ఒప్పందం కుదుర్చుకోలేదన్న కోపంతో ఇరాన్‌పై రగిలిపోతున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. "ఇరాన్ అణ్వాయుధాన్ని కలిగి ఉండకూడదు. ఈ విషయాన్ని నేను పదే పదే చెబుతున్నాను. టెహ్రాన్ ప్రజలంతా తక్షణమే ఆ నగరాన్ని వీడి వెళ్లిపోండి" అని హెచ్చరిస్తూ సోమవారం తన సొంత సామాజిక మాధ్యమమైన 'ట్రూత్ సోషల్'లో ఒక పోస్టు పెట్టారు. అనంతరం.. కెనడాలో జరుగుతున్న జీ7 సమావేశాన్ని వీడి అర్ధంతరంగా అమెరికాకు పయనమయ్యారు. జాతీయ భద్రతా సలహాదారులతో సమావేశం నిర్వహించడానికి 'సిచ్యువేషన్ రూమ్'ను సిద్ధం చేయాలని శ్వేతసౌధం వర్గాలను ఆదేశించారు. "సుప్రీం లీడర్‌గా చెప్పుకొంటున్న సదరు నేత ఎక్కడ దాక్కున్నాడో మాకు పక్కాగా తెలుసు. ఆయన్ను లక్ష్యంగా చేసుకుని దాడి చేయడం మాకు చాలా సులువు. కానీ, అక్కడ ఆయన క్షేమంగానే ఉన్నారు. ఆయన్ను మేం చంపం.. కనీసం ప్రస్తుతానికి!" అని మంగళవారం మరో పోస్టు పెట్టారు. పౌరులపైన, అమెరికా సైనికులపైన క్షిపణి దాడులను తాము సహించబోమని.. తమ సహనం నశిస్తోందని అందులో పేర్కొన్నారు. ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలని హెచ్చరిస్తూ మరో పోస్టు పెట్టారు. ఇరాన్ గగనతలం మొత్తం పూర్తిగా తమ నియంత్రణలో ఉందని హెచ్చరించారు. "ఇరాన్ వద్ద మంచి స్కై ట్రాకర్లు, ఇతర రక్షణ పరికరాలు ఉండొచ్చు. కానీ, వాటికి మా పరికరాలతో పోలికే లేదు" అని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ఈశాన్య సిరియాలో ఉన్న రెండు బేస్‌ల నుంచి అమెరికా బలగాలు వైదొలగాయి. ఆ బలగాలను ఎక్కడికి తరలించిందీ తెలియట్లేదు. ఇంకోవైపు.. అమెరికా నౌకాదళం తన సూపర్ క్యారియర్ (విమాన వాహక నౌక) యూఎస్ఎస్ నిమిట్జ్‌ను దక్షిణ చైనా సముద్రం నుంచి మధ్యప్రాచ్యం దిశగా.. వాయుసేనకు చెందిన 21 రీఫ్యూయెలింగ్ ట్యాంకర్లను (కేసీ-135 ఆర్, కేసీ-46ఏ) అమెరికా నుంచి యూరప్‌కు పంపుతున్నట్టు 'ద వార్‌జోన్' వార్తాసంస్థ ఒక కథనాన్ని ప్రచురించింది. మరోవైపు.. మధ్య టెహ్రాన్‌లో 3.3 లక్షల మంది ఉండే ఒక ప్రాంతాన్ని తక్షణమే ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరిక జారీ చేసింది.

**బీ 2 బాంబర్ల మోహరింపు..**

టంప్ అమెరికా అధ్యక్ష పగ్గాలు చేపట్టాక ఇరాన్ అణు కార్యక్రమంపై దృష్టి సారించి ఈ ఏడాది మార్చిలోనే.. ఆరు బీ2 స్టెల్త్ బాంబర్లను హిందూ మహాసముద్రంలోని డీగో గార్షియా దీవిలో మోహరించారు. మే నెలలో బీ 52 బాంబర్లను కూడా అక్కడికి తరలించారు.

## నేటి నుంచి టెట్ పరీక్షలు



**హైదరాబాద్, జూన్ 17:**
పాఠశాల విద్యాశాఖ నిర్వహించే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 15 జిల్లాల్లో 66 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని, అన్ని ఏర్పాట్లు పూర్తచే శామని టీజీటెట్ ఛైర్‌పర్సన్, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తెలిపారు. పరీక్షకు మొత్తం 1,83,653 మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో పేపర్-1 కోసం 63,261, పేపర్-2 కోసం 1,20,392 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఉపాధ్యాయ అర్హత పరీక్షను ప్రతి ఏటా రెండుసార్లు నిర్వహిస్తుండగా.. ఈ ఏడాదికి సంబంధించి ఇది మొదటి పరీక్ష కానుంది.

## ఇంజనీర్లు కడితే బ్యారేజీలు దెబ్బతినేవి కాదు

**కేసీఆర్ ఇంజనీర్ అవతారమెత్తడం వల్లే కొరగాకుండాపోయిన కాళేశ్వరం**

**కాంగ్రెస్ హయాంలో కట్టిన ఏ ప్రాజెక్టూ దెబ్బతినలేదు: డిప్యూటీ సీఎం భట్టి**



**భూపాలపల్లి, జూన్ 17:** కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను ఇంజనీర్ల సూచనల మేరకు నిర్మించి ఉంటే దెబ్బతినేవి కాదని, కేసీఆర్ ఇంజనీర్ అవతారమెత్తి తప్పుడు పద్ధతుల్లో కట్టడం వల్లే లక్ష కోట్లు ఖర్చు చేసినాఆ ప్రాజెక్టు ఎందుకూ కొరగాకుండా పోయిందని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క విమర్శించారు. భూపాలపల్లి జిల్లా చెన్నాపూర్ వద్ద నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను భట్టి ప్రారంభించారు.అనంతరం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభ వేదిక వద్ద మంజూర్‌నగర్, నవాబుపేట, ధర్మారావుపేటలో రూ.7.30 కోట్లతో నిర్మించ తలపెట్టిన విద్యుత్ సబ్ స్టేషన్లకు మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సభలో భట్టి మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో నిర్మించిన శ్రీరాం సాగర్, ఎల్లంపల్లి, జూరాల, నాగర్జున సాగర్ వంటి ప్రాజెక్టులు నేటికీ చెక్కుచెదరకుండా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందిస్తున్నాయన్నారు. కానీ కేసీఆర్ ప్రభుత్వం సరైన ఇంజనీరింగ్ పద్ధతులను అనుసరించకపోవటంతో లక్ష కోట్లు గోదాట్లో పోసినట్లయిందని విమర్శించారు.

## ఢిల్లీకి సీఎం రేవంత్.!

**ఇంగ్లండ్ మాజీ ప్రధాని టోనిబ్లెయిర్‌తో భేటీ**



**హైదరాబాద్, జూన్ 17:**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి ఢిల్లీ వెళ్లనున్నారు. రేపు, ఎల్లుండి రెండ్రోజులపాటు అక్కడే ఉండనున్నట్టు సమాచారం. పెట్టుబడులకు సంబంధించి కీలక భేటీలో పాల్గొంటారని తెలిసింది. అలాగే పార్టీ అ?ధిష్టానాన్ని, పలువురు కేంద్ర మంత్రులను కలవనున్నారు. ఇంగ్లండ్ మాజీ ప్రధాని టోనిబ్లెయిర్‌తో సీఎం రేవంత్ సమావేశం కానున్నట్టు సమాచారం. టోనీబ్లెయిర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ చేంజ్ (టీబీఐ)అనే ఎన్‌జీవోను బ్లెయిర్ నడిపిస్తున్నారు. ఇది అనేక దేశాల్లో పనిచేస్తోంది. ఈ క్రమంలో ఆయనతో భేటీ అయి పలు విషయాలపై చర్చించనున్నారు. కాగా ఏపీ టీడీపీ మంత్రి లోకేశ్ కూడా టోనిబ్లెయిర్‌తో సమావేశమవనున్నట్టు తెలిసింది.

## మోదీ ఎందుకు రాజీనామా చేయలేదు

**బీజేపీ నేతలకు కర్ణాటక సీఎం సిద్దరామయ్య ప్రశ్న**



**బెంగళూరు, జూన్ 17:** గుజరాత్‌లో 2002లో జరిగిన హత్యాకాండలో అన్ని మతాలకు చెందిన రెండు వేలమంది అమాయకులు ప్రాణాలు కోల్పోతే అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీ ఎందుకు రాజీనామా చేయలేదని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రశ్నించారు. ఆర్‌సీబీ విజయోత్సవాల సమయంలో చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటకు నైతిక బాధ్యత వహిస్తూ సీఎం, ఉపముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆందోళనలు చేయడంపై ఆయన మండిపడ్డారు. బెంగళూరులో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... అప్పట్లో బీజేపీ అగ్రనేత, ప్రధాని అటల్ బిహారీ వాజపేయి సీఎం పదవికి రాజీనామా చేయాలని మోదీకి సూచించారని, అయినా మోదీ పాటించలేదని పేర్కొన్నారు.

## పోలీసింగ్‌లో తెలంగాణ టాప్

**డ్రగ్స్, సైబర్ నేరాలకట్టడికి పటిష్ఠ చర్యలు: డీజీపీ జితేందర్**



**వికారాబాద్, జూన్ 17:** ప్రజలకు ఉత్తమ సేవలు అందించడంలో తెలంగాణ పోలీసు విభాగం దేశంలోనే మొదటి స్థానంలో ఉందని డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. మాదకద్రవ్యాల నిరోధానికి పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కేసుల్లో నిందితులు ఎంతటి వారైనా వదిలిపెట్టడం లేదని, విదేశాల నుంచి కూడా అరెస్టు చేసి తీసుకొస్తున్నామన్నారు. గత ఏడాది 30 వేల కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మాదకద్రవ్యాల నియంత్రణలో కూడా తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. జిల్లాల పర్యటనలో భాగంగా మంగళవారం వికారాబాద్ జిల్లా పోలీసు కేంద్ర కార్యాలయానికి వచ్చిన డీజీపీ.. విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సైబర్ నేరాల కేసుల్లో గత ఏడాది రూ.185 కోట్లను బాధితులకు ఇప్పించగా, ఇటీవల జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో రూ.50 కోట్లు ఇప్పించామని తెలిపారు.

# ఫోన్ ట్యాపింగ్‌లో సంచలనం

**- 400 నుంచి 600 మంది ఫోన్లు ట్యాపింగ్...**

**- బాధితులు ఫిర్యాదులు వెలుగులోకి రావడంతో లోతుగా విచారణ**




**తొవ్వ,ప్రతినిధి జూన్ 17**
తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణను వేగం పెంచారు. బీఆర్ఎస్ హయాంలో దాదాపు 400 నుంచి 600 మంది ప్రముఖులు, ప్రజాప్రతినిధుల ఫోన్‌లను ట్యాపింగ్ చేసినట్లు వెలుగులోకి రావడంతో బాధితుల నుంచి అధికారులు వాంగ్మూలాలు సేకరిస్తున్నారు. దీంట్లో భాగంగానే ఇవాళ (మంగళవారం) ఉదయం కాంగ్రెస్ ముఖ్య నేతలు ఒక్కొక్కరుగా విచారణకు హాజరయ్యారు. జూబ్లీహిల్స్ పీఎస్‌లోని సిట్ కార్యాలయానికి టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ చేరుకున్నారు.సిట్ ఎదుట ఆయన తన స్టేట్‌మెంట్ ఇస్తున్నారు. అలాగే ఫోన్ ట్యాపింగ్ కేసులో వాంగ్మూలం ఇచ్చేందుకు లిఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, గద్వాల జెడ్పీ మాజీ చైర్‌పర్సన్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జీ సరిత హాజరయ్యారు.వారి స్టేట్‌మెంట్‌ను అధికారులు రికార్డ్ చేస్తున్నారు. ఈ కేసులో సాక్షులు, బాధితుల వాంగ్మూలాలే కీలకంగా మారనున్నట్లు తెలుస్తోంది.

**కాంగ్రెస్ శ్రేణుల హడావుడి.. స్వల్ప తోపులాట..**

కాంగ్రెస్ నేతలు సిట్ విచారణకు హాజరైన నేపథ్యంలో జూబ్లీహిల్స్ పీఎస్ వద్దకు కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివచ్చారు. పీఎస్‌లోనికి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకుని వారిని బయటకు పంపించివేశారు. ఈ క్రమంలో స్వల్ప తోపులాట జరిగింది. కాంగ్రెస్ శ్రేణుల హడావుడి నేపథ్యంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.బాధితుల స్టేట్‌మెంట్ తర్వాతే కీలక విచారణ..!ఈ కేసులో ప్రధాన నిందితుడు ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, మరో నిందితుడు రాధాకిషన్‌రావులు ఇవాళ మరోసారి సిట్ ఎదుట విచారణకు హాజరు కానున్నారు. రేపు ప్రణీత్‌రావును విచారించనున్నారు. బాధితుల జాబితాలో ఉన్న కాంగ్రెస్ నేతల వాంగ్ములాల అనంతరం నిందితులను విచారణ చేయనున్నట్లు సమాచారం. బాధితుల స్టేట్‌మెంట్ ఆధారంగా నిందితుల వాంగ్మూలం రికార్డు చేయనున్నట్లు సమాచారం. దీంతో కేసు ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# యోగా ప్రపంచ ఐక్యతా స్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది: ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ జూన్, 17 :** యోగా అనేది కేవలం వ్యక్తిగత ఆరోగ్యం గురించి మాత్రమే కాకుండా, మానవత్వం, పర్యావరణ పరిరక్షణ, ప్రపంచ ఐక్యతా స్ఫూర్తిని నెలకొల్పడానికి కూడా తోడ్పడుతుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. జూన్ 21వ తేదీన విశాఖపట్నంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ప్రధాని పిలుపునిచ్చారు. ఈ మేరకు యోగా దినోత్సవ సందేశంతో కూడిన లేఖను ప్రధాని విడుదల చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలు యోగా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. చారిత్రాత్మక యోగా ప్రస్థానం విజయవంతంగా 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మరింత వైభవంగా నిర్వహించుకోబోతున్నాం. గత పదేళ్లుగా యోగా కేవలం భారతదేశంలోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలందరికీ చేరువై వారి జీవితాల్లో సానుకూల ప్రభావం చూపుతోంది. అది మనందరికీ గర్వకారణం. ఈ ఏడాది విశాఖపట్నం కేంద్రంగా జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'యోగా.. ఒక భూమి.. ఒక ఆరోగ్యం..' అనే థీమ్‌తో జరుపుకోబోతున్నాం' అని ప్రధాని పేర్కొన్నారు. 'యోగా మన సంస్కృతిలో ఒక అంతర్భాగం. ఇది శరీరం, మనసు మధ్య సమతుల్యతను సాధించడంలో సహాయపడుతుంది. శారీరకంగా, మానసికంగా స్వావలంబన పొందిన పౌరులు దేశ నిర్మాణంలో మరింత కీలక పాత్ర పోషించగలరు. దేశవ్యాప్తంగా ప్రతి పంచాయతీ పరిధిలో జూన్ 21న జరగబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో వీలనంత ఎక్కువ మందిని భాగస్వామ్యం చేయాల'ని ప్రధాని మోదీ అకాంక్షించారు.

## కెనడాలో మోదీపై దాడికి ఖలిస్థానీల కుట్ర

**టొరంటో, జూన్ 17:** ప్రధాని మోదీ కెనడా పర్యటన సందర్భంగా ఖలిస్థానీ వేర్పాటువాదులు ఆకస్మిక దాడికి కుట్రపన్నారు. జీ7 సదస్సులో పాల్గొనేందుకు మోదీ మంగళవారం కెనడాకు చేరుకున్నారు.ఈ నేపథ్యంలో అల్బెర్టా రాష్ట్రంలోని కల్గరీ నగరంలో నిరసన తెలిపేందుకు ఖలిస్థానీ వేర్పాటువాదులు గుమి గూడారు. ఈ కార్యక్రమాన్ని మోదీకి వ్యతిరే కంగా 'ఆకస్మిక దాడి'గా వేర్పాటువాదులు అభివర్ణించుకున్నారు. ఈ సందర్భంగా హింసాత్మక నినాదాలు చేశారు. 'మోదీ రాజకీయాలను చంపేయండి(కిల్ మోదీ పాలిటిక్స్)' అంటూ కెనడా ప్రధాని మార్క్ కార్నీకి నిరసనకారులు పిలుపునిచ్చారు. అలాగే, 'భారత రాజకీయాలను చంపేయండి(కిల్ ఇండియా పాలిటిక్స్)' అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు నిరసనకారులు పిలుపునిచ్చారు.

# 21న జరిగే వేముల మహేందర్ 4వ వర్ధంతి సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సదస్సును జయప్రదం చేయండి

**జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి**

**యాదాద్రి జిల్లా: వలిగొండ: తోవ్వ ప్రతినిధి :జూన్ 17**
అమరజీవి వ్యవసాయ కార్మిక సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు వలిగొండ మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు వేముల మహేందర్ నాలుగవ వర్ధంతి సందర్భంగా వలిగొండ మండల కేంద్రంలో శివసాయి ఫంక్షన్ హాల్ లో వ్యవసాయ కార్మికులు ఉపాధి-పాలకుల వైఖరి అనే అంశంపై జరుగు జిల్లా సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి పిలుపునిచ్చారు.మంగళవారం రోజున జిల్లా సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని మండల కేంద్రంలో ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరజీవి వ్యవసాయ కార్మిక సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు వలిగొండ మండల పరిషత్ ఉపాధ్యక్షులు వేముల మహేందర్ నాలుగో వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో వ్యవసాయ కార్మికులు ఉపాధి పాలకుల వైఖరి అనే అంశంపై జిల్లాస్థాయి సదస్సును నిర్వహిస్తున్నామని ఈ సదస్సుకు వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్ మరియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్ రాములు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని ఈ సదస్సుకు జిల్లా వ్యాప్తంగా 250 మంది వ్యవసాయ కార్మిక సంఘం లో పనిచేసే నాయకులు వ్యవసాయ కూలీలు పాల్గొంటారని తెలిపారు. ఈ సదస్సు జయప్రదం కోసం వ్యవసాయ కార్మికులు ఇతర పెద్దలు సహకరించాలని కోరారు. కేంద్రంలోని బిజెపి



ప్రభుత్వం యూపీఏ-1 ప్రభుత్వంలో వామపక్షాల పోరాట ఫలితంగా ఏర్పడిన ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తుందని అన్నారు .ఉపాధి హామీ చట్ట రక్షణ కోసం వ్యవసాయ కార్మికులు ఉద్యమించి కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి, మండల కార్యదర్శి కల్యారి రామచందర్, ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ సభ్యులు సిర్పంగి శ్రీరాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు దొడ్డి బిక్షపతి, వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షులు కొండూరు సత్తయ్య, మండల నాయకులు పోలపల్లి ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

# వానకాలం పెట్టుబడి సాయం అందింది

**- అన్నదాతకు ఆసరా ఇచ్చింది రైతు భరోసా - శభాష్ రేవంతన్న అంటున్న రైతులు**

**- రైతుల ప్రభుత్వంలో రైతులకు సాయం - కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తవణం సుఖేందర్ రెడ్డి**

**తొవ్వ,కురవి జూన్ 17**
రైతుల ప్రభుత్వంలో రైతులకు మంగళవారం సాయంత్రం నాలుగున్నర గంటలకు టింగ్ టింగ్ మంటూ సెల్ ఫోన్ మెసేజ్ లు రావడం మొదలైందని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తవణం సుఖేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అయ్యగారి పల్లి గ్రామంలో ఆయన మాట్లాడుతూ సాయంత్రం నాలుగున్నర గంటల నుంచి సెల్ ఫోన్ లో రైతులందరికీ మెసేజ్ లు రావడం మొదలైదని అన్నదాతకు ఆసరా ఇచ్చే రైతు భరోసా వానాకాలం పంటలకు పెట్టుబడి సాయం అందిందని రైతులందరూ శభాష్ రేవంత్ అన్న అని అంటున్నారని ఆయన అన్నారు. సాయంత్రం వచ్చిన మెసేజ్ లను రైతులు చూసుకొని విత్తనాలు కొనేందుకు షాపులకు



వెళ్లేటప్పుడు రైతుల కళ్ళల్లో సంతోషాన్ని చూస్తే కడుపు నిండిపోతుందని అన్నారు. ప్రభుత్వం వరసమ్మటి ఇస్తున్న సంక్షేమాలు, ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం, స్కూల్ పిల్లలకు యూనిఫామ్ లు, ఇప్పుడు రైతు భరోసా, తో ప్రజలకు వరసమ్మటి సంక్షేమాలు అందేసరికి వారి కళ్ళల్లో ఆనందానికి అవధులు లేకుండా పోయాయని ప్రతి ఒక్కరు రేవంత్ రెడ్డి ప్రభుత్వం నాలుగు కాలాలపాటు చల్లగా ఉండాలని దీవిస్తున్నారు అని ఆయన అన్నారు. ఇదే కదా ప్రజలకు కావలసిన సాయం రైతు రుణమాఫీ చేసినట్టు గత ప్రభుత్వాలు చేయలేకపోయాయని ఆయన ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రజలు రైతులు రైతు క్షేమం కోరే ప్రభుత్వానికి అండగా నిలవాలని ఆయన కోరారు.

# సివిల్ విషయాల్లో జోక్యం చేసుకుంటున్న పోలీసుల పట్ల హైకోర్టు సీరియస్




**తొవ్వ 17 జూన్,ఎల్బీనగర్ ప్రతినిధి**
న్యాయస్థానం చేసే పని కూడా పోలీసులే చేస్తారా ? పోలీసులు శాంతి భద్రతల కంటే సివిల్ విషయాల్లోనే ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు అని హైకోర్టు సీరియస్ అయ్యింది.పూర్తి వివరాల్లోకి వెళితే హైదరాబాద్ - బార్కస్ ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి ఇంటి స్థలంపై హైకోర్టులో పిటిషన్ వేయగా, ఆ పిటిషన్ ను వెనక్కి తీసుకోవాలని బాధితుడిని బెదిరించిన పోలీసులు. దీంతో పోలీసులు బెదిరిస్తున్నారని హైకోర్టును ఆశ్రయించిన బాధితుడు బాధితుడు ఫిర్యాదు మేరకు విచారణ జరిపి, పోలీసులపై తీవ్రంగా మండిపడ్డ హైకోర్టు. శాంతి భద్రతలకంటే సివిల్ విషయాల్లోనే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు ఎందుకు ? హైకోర్టులో ఉన్న పిటిషన్ ను వెనక్కి తీసుకోమని చెప్పడానికి మీరెవరు ? అంటూ పోలీసుల పట్ల ఆగ్రహం వ్యక్తం చేసిన హైకోర్టు ధర్మాసనం. ఎన్ని సార్లు చెప్పినా మీరు మారరా ? ఎండలో ఫిర్యాదు చేయడానికి వచ్చిన వారికి పోలీస్ స్టేషన్లో కనీసం మంచి నీళ్ళు కూడా ఇవ్వరు, స్టేషనరీ కూడా ఫిర్యాదుదారుడే తెచ్చుకోవాలని చెప్తున్నారని పోలీసులపై మండిపడ్డ హైకోర్టు. ఇకనైనా పోలీసులు తమ వైఖరి మార్చుకోవాలని, బాధితుడిని బెదిరించిన పోలీసులపై విచారణ జరపాలని ఆదేశించిన హైకోర్టు. న్యాయస్థానాలు చేసే పని చేయడానికి ప్రయత్నించడం ఆపేయాలని, సివిల్ విషయాల్లో జోక్యం చేసుకోవద్దని పోలీసులను హెచ్చరించిన హైకోర్టు.

## రైతు భరోసా అన్నదాతలకు ఆత్మీయ భరోసా

**- తాళ్ళపల్లి కృష్ణ గౌడ్**

**తొవ్వ,గార్ల జూన్ 17 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడుతుందని అనటానికి మరో మారు రైతులకు రైతు భరోసా అందించడం రైతన్నలకు ఆత్మీయ భరోసా అని మండల కాంగ్రెస్ పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షులు తాళ్లపల్లి కృష్ణ గౌడ్, జాతీయ శ్రీ శక్తి అవార్డు గ్రహీత శంషాద్ బేగం అన్నారు.



గార్ల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణరాష్ట్రంలోతెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సోమ వారం నాడు ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రైతులకు అండగా ఉండటం కోసం రైతు భరోసా నిధులను విడుదల చేశారని రాష్ట్రంలో సుమారు 70 లక్షల పదకొండు వేల 984 మంది రైతన్నలకు అండగా ఈ పథకం తొమ్మిది రోజులలో తొమ్మిది వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగడం హర్షనీయమని అన్నదాత ఆత్మగౌరవానికి, అతడి చెమట చుక్కలకు ప్రజా ప్రభుత్వం ఇస్తున్న భరోసా ఇదని, భవిష్యత్తులో అభివృద్ధి ,సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందని మరోమారు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే అధికారంలో ఉండాలని రైతన్నలందరూ కోరుకుంటున్నారని వారు అన్నారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు దికొండ రాము, లింగాల జెన్నయ్య, సర్వేష్ నాయక్, కోలా కుమార్ గౌడ్, భీముడు నాయక్, హరి,వీరేశం పాల్గొన్నారు.

## ఇండ్లు ఉన్నవారికేనా...? ఇందిరమ్మ ఇండ్లు...??

**- జరగనున్న స్థానిక ఎన్నికలలో బుద్ధి చెప్తాం...**

**- ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి జెల్లంపల్లి పవన్...**

**తొవ్వ, కేసముద్రం, జూన్17:** అసలైన నిరుపేదలకు అన్యాయం చేసి ఇండ్లు ఉన్న వారికే ఇందిరమ్మ ఇండ్లను కేటాయించిన నాయకులకు జరగనున్న స్థానిక ఎన్నికలలో ప్రజలు కచ్చితంగా బుద్ధి చెప్తారని ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి జెల్లంపల్లి పవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నాడు కేసముద్రం మండల కేంద్రంలో పత్రిక ప్రకటన విడుదల చేసి మాట్లాడారు... రాష్ట్ర ప్రభుత్వం ఎల్1, ఎల్2,ఎల్3 ప్రకారం అర్హులను గుర్తించి అసలైన నిరుపేదలకు న్యాయం చేస్తామని చెప్పి



నేడు ఇండ్లు ఉన్నవారికి కేటాయించడం సిగ్గుచేటు అన్నారు.ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం చెప్పిందేంటి అసలు చేస్తున్నది ఏంటి అని నిలదీశారు. మండల వ్యాప్తంగా సొంతింటి కల సహకారం అవుతుందని ఎదురుచూసిన నిరుపేదలకు నాయకుల రూపంలో రాబందుల వలె వచ్చి వారి ఆశలను అడియాశలు చేశారన్నారు. లబ్ధిదారులను గుర్తించే బాధ్యత అధికారులకు ఇవ్వకుండా ఇందిరమ్మ కమిటీలకు ఇవ్వడంతో అసలైన నిరుపేదలకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కమిటీలు ఇండ్లు ఉన్నవారికి,కాంగ్రెస్ నాయకులకే కేటాయించి అసలైన నిరుపేదలకు అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొద్దో గొప్పో ఇండ్లు ఉన్న వారికే ఇండ్లు కేటాయించారని అస్సలు ఇండ్లు లేని వాళ్ల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఖచ్చితంగా జరుగునున్న స్థానిక ఎన్నికలలో నిరుపేద ప్రజలు ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు..

## ప్రయివేట్ పాఠశాలల దోపిడీకి గురికాకండి అంగన్వాడీ కేంద్రాలకు పంపించండి

**- అంగన్వాడీ సూపర్వైజర్ సంపూర్ణ**




**తొవ్వ,గార్ల జూన్17**
పిల్లలను ప్రయివేటు పాఠశాలలకు పంపి దోపిడీకి గురికాకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపించి నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారం అందిచడానికి తల్లిదండ్రులు ముందుకురావలని డోర్నకల్ ప్రాజెక్టు సూపర్వైజర్ సంపూర్ణ అన్నారు. గార్ల మండలంలోని గోపాలపురం సెక్టార్ పరిధిలోని శేరిపురం గ్రామపంచాయతీ పరిధిలోని దుబ్బతండా, మర్రిగూడెం, చవిటితండా, శేరిపురం అంగన్వాడీ కేంద్రాలలో అమ్మమాట-అంగన్వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులకు అక్షరాభ్యాసం చేశారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో, గ్రామపెద్దలతో మాట్లాడుతూ అంగన్వాడీలలో పిల్లలకు పౌష్టికాహారంతో భోజనం పెడుతూ వారి ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షణలో ఉంచుతూ వారికి సొంత తల్లిలా టీచర్లు అక్షరాలు నేర్పిస్తూ జాగ్రత్తగా చూసుకుంటారని, ప్రయివేటు పాఠశాలలకు పంపి దోపిడీకి గురికాకూడదని వారితో ప్రదర్శన రూపంలో వివరించారు. టీచర్లతో మాట్లాడుతూ విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించి 5సంవత్సరాల వరకు ప్రయివేటుకు కాకుండా అంగన్వాడీ కేంద్రాలకు వచ్చేలా చూస్తూ వారి హాజరుశాతం పెంచాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు నాగమణి, స్వరూప, సీత, మీనాభాయి, పిల్లల తల్లిదండ్రులు, గ్రామపెద్దలు పలువురు పాల్గొన్నారు.

## బయ్యారం పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకెన్

**బయ్యారం,తోవ్వ,జూన్ 17.**



బయ్యారంలో స్థానిక పోలీస్ స్టేషన్ ను మహబూబాబాద్ జిల్లా ఎస్పి సుధీర్ రాంనాధ్ కేకెన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు.ప్రతి వాహనదారుడు హెల్మెట్ వాడేలా అవగాహన కల్పించాలని అన్నారు.నిత్యం ఇసుక అక్రమ తొలకలను అరికట్టాలని, గంజాయి అక్రమ రవాణా, యువకులు గంజాయి బారిన పడకుండా అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని,అదేవిదంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేయాలని,బాలికలకు, యువతులకు,మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ తిరుపతి రావు,సీఐ రవి కుమార్,ఎస్ఐ తిరుపతి,ఇతర పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## బయ్యారం జూనియర్ కళాశాల అడ్మిషన్స్ ప్రారంభం

**- కళాశాలలో అడ్మిషన్ తీసుకున్న వారికీ ఉచిత వసతి, భోజన సదుపాయాలు కలవు**

**- కళాశాల ప్రిన్సిపాల్ నరేంద్ర రాజు**

**బయ్యారం,తోవ్వ,జూన్ 17**
బయ్యారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్స్ కోసం ప్రిన్సిపాల్ నరేంద్ర రాజు ఆధ్వర్యంలో మంగళ వారం మండలంలో క్యాంపెనింగ్ నిర్వహించారు.ఈ క్యాంపెనింగ్ కొరకు అధ్యాపకుల బృందం చర్లపల్లి,ఇర్సులాపురం, కట్టుగూడెం గ్రామలలో ఈ మధ్య టెన్త్ క్లాస్ పాస్ అయిన విద్యార్థిని విద్యార్థులకు, మా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరమని మోటివేషన్ చేశారు.ఈ కళాశాలలో అడ్మిషన్ తీసుకున్న బాలురకు, బాలికలకు ఉచిత వసతి, భోజన సదుపాయలు ప్రభుత్వం ఏర్పాటు చేసింది.కాబట్టి ప్రభుత్వం కళాశాలలో అడ్మిషన్ తీసుకొని ఆర్థికంగా మీ తల్లిదండ్రులకు ఆర్థిక భారం లేకుండా హాస్టల్ ఉచిత వసతి భోజన సదుపాయాలు ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కోరారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సంతోష్, బాబూలాల్, రాజు, కుమారస్వామి, గిరి, స్నేహ, సదాశివుడు, సరితా, రాజేష్, భాస్కర్ రాజు పాల్గొన్నారు.



## సెల్ ఫోన్ ఇవ్వలేదని 6వ తరగతి విద్యార్థి ఆత్మహత్య

**తొవ్వ : 17 జూన్,ఎల్బీనగర్ ప్రతినిది**
హైదరాబాద్-బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్రకుంట మహమ్మద్ నగర్ ప్రాంతానికి చెందిన షేక్ నిసార్ అహ్మద్ అనే వ్యక్తి ఆటో డ్రైవర్ గా జీవనం కొనసాగిస్తున్నాడు.అదే ప్రాంతానికి చెందిన ఒక ప్రైవేటు స్కూల్లో 6వ తరగతి చదువుతున్న అతని కొడుకు షేక్ అయాన్ (14) తనకు సెల్ ఫోన్ కావాలని తండ్రిని కోరగా, ఈ వయసులో సెల్ ఫోన్ ఎందుకని అయాన్ ను మందలించిన తండ్రి. దీంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యి, ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న అయాన్.



# చెరువు పూడిక మట్టితో రైతన్నకు మేలు

## - సారవంతమైన నేల.... రైతన్నకు ఆదా - జిల్లా హార్టికల్చర్ అధికారి మరియన్న

**తొవ్వ,మహబూబాబాద్, జూన్.17**
పూడిక మట్టి అనేది చెరువులు, నదులు, ఇతర జలమయ ప్రాంతాలలో పేరుకుపోయిన మట్టి. ఇది అనేక విధాలుగా ఉపయోగించబడుతుందని ముఖ్యంగా వ్యవసాయం పర్యావరణం కోసం పూడిక మట్టి చాలా ఉపయోగమని జిల్లా ఉద్యానపరిశ్రమ అధికారి జినుగు మరియన్న వివరించారు. పూడిక మట్టి ఉపయోగాలు రైతన్న కు లాభాలు గూర్చి మంగళవారం తెలిపారు. పంట దిగుబడిని పెంచుతుందని పూడిక మట్టిలో నత్రజని, భాస్వరం, పొటాషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇది మొక్కల పెరుగుదలకు సహాయపడుతుంది మరియు దిగుబడిని పెంచుతుంది.



**నేల సారవంతం చేస్తుంది**
పూడిక మట్టిలో ఉండే సేంద్రియ పదార్థం నేల యొక్క సారవంతతను పెంచుతుంది. ఈ మట్టి నీటిని నిల్వ చేయడానికి సహాయపడుతుంది, ఇది మొక్కలకు అవసరమైన తేమను అందిస్తుంది.

**రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తుంది**
పూడిక మట్టిలో పోషకాలు ఉండటం వలన, రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించవచ్చు.

**పర్యావరణానికి సహాయపడుతుంది**
పూడిక మట్టిని ఉపయోగించడం వలన, రసాయనిక ఎరువుల వల్ల కలిగే పర్యావరణ కాలుష్యం తగ్గుతుంది.

**నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుతుంది**
పూడిక మట్టిని చెరువులలో నుండి తొలగించడం వలన, వచ్చే వర్షాకాలంలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది.

**పంటల చీడపీడల బారి నుండి కాపాడుతుంది:**
సూక్ష్మ పోషకాలు (జింక్, ఐరన్, మాంగనీస్, కాపర్, బోరాన్) చీడపీడల బారి నుండి మొక్కలను కాపాడుతాయి.

**మట్టి ఆకృతిని మెరుగుపరుస్తుంది:**
పూడిక మట్టిలో ఉండే సేంద్రియ పదార్థం మట్టి ఆకృతిని మెరుగుపరుస్తుంది, దీని ద్వారా మొక్కల వేర్లు బాగా పెరుగుతాయి.

**మొక్కల పెరుగుదలకు సహాయపడుతుంది:**
పూడిక మట్టిలో ఉండే సూక్ష్మజీవులు మొక్కల పెరుగుదలకు సహాయపడతాయి.

**చెరువు మట్టితో ప్రయోజనాలు:**
ఈ మట్టితో చెరువు నిండుతుంది. వేసవిలో నీళ్లు తక్కువగా ఉండడం వల్ల ఈ మట్టిని పూడిక తీయడం వల్ల మళ్లీ వచ్చే ఏడాది చెరువులో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. ఎక్కువ నీళ్లు నిలిచే అవకాశం ఉంటుంది. తద్వారా నీటి లభ్యత పెరుగుతుంది.

**పూడిక మట్టితో పుట్టెడు లాభాలు ...**
తదితర పోషకాలు పూడిక మట్టిలో ఉన్నాయని పరిశోధనలో తేలింది. పూడిక మట్టి వాడకం వలన 50శాతం రసాయనిక ఎరువుల వినియోగం తగ్గును.చేనుకు చేవ చెరువుమట్టి. చెరువులలోని సారవంతమైన మట్టిలో ఎన్నో పోషకాలు ఉంటాయి. పూడిక మట్టి పెరుగుతున్న మొక్కలకు పోషకాలను అందిస్తుంది. ఎందుకంటే ఈ మట్టి ప్రాంతం మొక్కలు పెరగడానికి అవసరమైన కార్బన్ మరియు నైట్రోజన్ అణువులను అందించడం ద్వారా ప్రధాన జీవ పోషకాల సైక్లింగ్‌ను చేస్తుందని వివరించారు.

## లంచం తీసుకుంటూ అనిశా అధికారులకు పట్టుబడిన హైదరాబాద్ మహా నగర పాలక సంస్థ, కాప్రా సర్కిల్-1 కార్యాలయంలోని సహాయక కార్యనిర్వాహక ఇంజనీరు బి. స్వరూప

**తొవ్వ 17 జూన్,ఎల్బీనగర్ ప్రతినిధి**
ఫిర్యాదుధారుడు పూర్తి చేసిన పనిని కొలతల పుస్తకంలో నమోదు చేయడానికి" అధికారిక సహాయం చేసేందుకు అతని నుండి రూ.1,20,000/- లంచం తీసుకుంటూ తెలంగాణ అనిశా అధికారులకు పట్టుబడిన హైదరాబాద్ మహా నగర పాలక సంస్థ, కాప్రా సర్కిల్-1 కార్యాలయంలోని సహాయక కార్యనిర్వాహక ఇంజనీరు.బి. స్వరూప. ఒకవేళ ఏ ప్రభుత్వ సేవకుడు అయినా లంచం అడిగినట్లయితే ప్రజలు దయచేసి తెలంగాణ అవినీతినిరోధకశాఖ వారి "టోల్ ఫ్రీ నెంబర్ 1064 కు డయల్ చేయండి". అంతే కాకుండా వివిధ సామజిక మధ్యమాలయిన "వాట్సాప్ ( 9440446106) ఫేస్ బుక్ (**Telangana ACB**), ఎక్స్ (**@TelanganaACB**) మరియు వెబ్ సైట్ (acb.telangana.gov.in) ద్వారా కూడా తెలంగాణ అనిశా ను సంప్రదించవచ్చును అనిఫిర్యాదుధారుల / బాధితుల వివరములు గోప్యంగా ఉంచబడును అని అధికారులు తెలిపారు.



## నియోజకవర్గంలోని ప్రతి రోడ్డు 5.5 మీటర్ల వెడల్పు ఉండాల్సిందే

### రోడ్ల నిర్మాణంలో నాణ్యత పై రాజీ పడేది లేదు

### రోడ్ల నిర్మాణ పనితీరు పై అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్షలో.... కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



**తొవ్వ.జూన్ 17. మునుగోడు :**
మునుగోడు నియోజకవర్గంలో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖ ల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రోడ్ల పనుల పురోగతిపై మునుగోడు లోని అధికారిక క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి అధికారులు, రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు గౌరవ మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి గారు... సాగర్ రోడ్డు నుండి ముష్టిపల్లి వరకు, ముష్టిపల్లి నుండి నాంపల్లి వరకు జరుగుతున్న ఆర్ అండ్ బి రోడ్ల పనులు ఎంతవరకు వచ్చాయని కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.. రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని నాణ్యత విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు.. వీటితోపాటు అంగడిపేట నుండి లెంకలపల్లి వరకు చేపట్టబోయే రోడ్డు పనులకు సంబంధించి టెండర్ ప్రొసీజర్ ఎంతవరకు వచ్చిందని ఆరా తీశారు... నాంపల్లి నుండి ఇడికుడ వరకు, ఇడికుడ నుండి కమ్మగూడెం(తెరట్ పల్లి) వరకు ఉన్న పంచాయతీరాజ్ రోడ్లను ఆర్ అండ్ బి రోడ్లుగా మార్చిన తర్వాత వాటి పనులకు సంబంధించి పురోగతి పై ఆరా తీశారు... వీటితోపాటు నియోజకవర్గంలో **HAM(Hybrid Annuity Model)** కింద ఎన్ని రోడ్లకు ప్రపోజల్స్ పంపించారనే విషయాలపై చర్చించారు... పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న పిఆర్ రోడ్ల పనుల పురోగతిపై అధికారులు, కాంట్రాక్టర్లతో చర్చించారు... ప్రస్తుతం జరుగుతున్న 57 రోడ్ల పనులు ఎంతవరకు వచ్చాయి ఎప్పటి వరకు పూర్తవుతాయని ఆరా తీశారు... ఇవే కాకుండా మరో 34 పి ఆర్ రోడ్ల టెండరింగ్ ప్రక్రియ ఎంతవరకు వచ్చిందని అధికారులను అడిగి తెలుసుకున్నారు... ప్రస్తుతం జరుగుతున్న 89 రోడ్డు పనుల ప్రోగ్రెస్ పై ఫోకస్ పెట్టి ప్రతిరోడ్డు 5.5 మీటర్లు వెడల్పు తో నాణ్యతతో నిర్మించాలన్నారు... నియోజకవర్గం లోని ప్రతి పిఆర్ రోడ్డు 3.75 మీటర్ల నుండి 5.5 మీటర్ల వెడల్పుకి మార్చాలని అధికారులను ఆదేశించారు... నియోజకవర్గంలో ఏ రోడ్డును చూసినా కూడా 5.5 మీటర్ల వెడల్పుతో ఉండాలని సూచించారు.. విడతల వారీగా నియోజకవర్గంలోని అన్ని రోడ్లను నిర్మాణం చేసుకోవాలన్నారు.. మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా నాణ్యతతో కూడిన రోడ్ల నిర్మాణం కోసం, ప్రభుత్వంతో మాట్లాడి నిధులు తెప్పించే బాధ్యత నాదని, నాణ్యత రోడ్ల నిర్మాణం చేయాల్సిన బాధ్యత మీపై ఉందని కాంట్రాక్టర్లకు సూచించారు.. ఈ సమీక్ష సమావేశంలో రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్లతోపాటు, పంచాయతీరాజ్ ఈ ఈ గిరిధర్, ఆర్ అండ్ బి మునుగోడు డి ఈ శరత్ చంద్ర, పి ఆర్ ఎ ఈ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ లబ్ధిదారులకు, కమిటీ సభ్యులకు, మేస్త్రీలకు అవగాహన సదస్సు

### ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీ దొంతి మాధవ రెడ్డి, కలెక్టర్ శ్రీమతి సత్యశారద

**తొవ్వ,ప్రతినిధి, నర్సంపేట, జూన్ 17:**
వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గ కేంద్రంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు , కమిటీ సభ్యులకు, మేస్త్రిలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి , కలెక్టర్ సత్యశారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ నియోజకవర్గంలో నేటికి 3176 ఇండ్లకు మంజూరు పత్రాలు ఇచ్చామని తెలిపారు. మరో 3,000 ఇండ్లు త్వరలో ఇవ్వనున్నట్లు తెలిపారు.ఇండ్ల నిర్మాణానికి మొరం(మట్టి) సమస్య లేకుండా లబ్దిదారులు తహసీల్దార్లకు దరఖాస్తు పెట్టి అనుమతి తీసుకొని మొరం ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. మేస్త్రిలకు అధిక మొత్తంలో ఉపాధి దొరుకుతుందని, వారు కూడా లబ్ధిదారులకు ఇబ్బందులకు గురి చేయకుండా లబ్దిదారులకు, ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ వెంట వెంటనే విడతల వారీగా బిల్లులు మంజూరు అవుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, ఎమ్మెల్యే గారికి వారు కృతజ్ఞతలు తెలిపారు.



## ఉప్పల్‌లోని భారత్ పెట్రోల్ పంప్‌లో 'పెట్రోల్ స్కామ్'

**తొవ్వ : 17 జూన్,ఎల్బీనగర్ ప్రతినిధి**



మెహఫిల్ రెస్టారెంట్ ఎదురుగా ఉండే పెట్రోల్ పంప్‌లో వెలుగుచూసిన స్కామ్.అనుమానం వచ్చి.. ఒక లీటర్ బాటిల్‌లో రూ.100ల పెట్రోల్ కొట్టించిన ఓ వ్యక్తి.రూ.100 విలువైన పెట్రోల్ కన్నా తక్కువగా రావడంతో.. వారిని నిలదీసిన వైనం.ఇంకెంత కావాలి.. 100కి వచ్చేది అంతే అంటూ దురుసుగా యాజమాన్యం రిప్లై.అక్కడే ఉన్న కస్టమర్లు కోపాద్రిక్తులై నిలదీయడంతో యాజమాన్యం ఉక్కిరిబిక్కిరి.ఏదో పొరపాటు జరిగిందంటూ.. తప్పుని సరిదిద్దుకునేందుకు సిబ్బంది ప్రయత్నం చేసారు.మీటర్‌లో సెట్టింగ్ చేసి.. తక్కువ పెట్రోల్ పోసి ప్రజల్ని మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు.

## ప్రముఖ వ్యాపారవేత్త వేముల బాబ్జిని పరామర్శించిన కాంగ్రెస్ నేతలు

**తోవ్వ, నెల్లికుదురు, జూన్ 17**



మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ అసోసియేషన్ మండల అధ్యక్షులు వేముల బాబ్జి ఇటీవలే వెన్ను నొప్పితో బాధపడుతూ ఉమ్మడి జిల్లా కేంద్రమైన వరంగల్ లోనీ ప్రముఖ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించుకుని స్వగృహానికి చేరుకోగా విషయం తెలుసుకొని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యెదల్లా యాదవ రెడ్డి, మండల అధ్యక్షులు గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్, సీనియర్ నాయకులు వలభోజు వెంకటేశ్వర్లు, జగన్నాథం ట్రస్ట్ చైర్మన్ పెరుమాండ్ల జగన్‌గౌడ్‌లు మంగళ వారం ఆయన స్వగృహానికి చేరుకొని పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయనను యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వ్యాపార దక్షత తో పాటు ప్రజాసేవ గుణం కలిగిన వ్యక్తి నీ భగవంతుడు నిండు నూరేళ్ల ఆయురా రోగ్యాలతో ఉండే విధంగా చూడాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. త్వరగా కోలుకొని మళ్లీ ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్షించారు.

## స్వదేశానికి వస్తున్న మాజీ జడ్పిటిసి వాకిటి పద్మా అనంత రెడ్డికి స్వాగతం పలికిన వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్

**యాదాద్రి జిల్లా: వలిగొండ: తోవ్వ ప్రతినిధి :జూన్ 17**



విదేశీ పర్యటన ముగించుకుని నేడు స్వదేశానికి తిరిగి వస్తున్న యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పిటిసి వాకిటి పద్మా అనంతరెడ్డికి వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యులు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలోని నిరుపేద కుటుంబాలకు ఆర్థిక చేయూతనిస్తూ అండగా నిలుస్తున్న అనంత రెడ్డి సేవలు అభినందనీ యమని వారన్నారు. స్వాగతం పలికిన వారిలో గౌరవ అధ్యక్షులు మారగోని శ్రీనివాస్ గౌడ్, అధ్యక్షులు బాలగోని హనుమంతు గౌడ్, రెబ్బ కుమారస్వామి, బల్గురి వెంకటరెడ్డి, దేశపాక కృష్ణస్వామి, బొడిగె సుదర్శన్, మార్క భగవంత,సంగిశెట్టి విజయ్, నీలం నరేందర్,కూచి మల్ల నాగేష్, దంతూరి నరేష్, వీసం రాజు, తదితరులున్నారు.

## సీ.ఎం.రిలీఫ్ ఫండ్‌తో పేదలకు లబ్ది

### ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి

**తొవ్వ,17 జూన్,ఎల్బీనగర్ ప్రతినిధి**



బాధిత భర్త పర్వతాలు గారికి 2,00,000 రూపాయల ఎల్.ఓ.సీ. అందజేస్తున్న ఎల్.బి. నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుదీర్ రెడ్డి.చంపాపేట డివిజన్ పరిధిలోని దుర్గ భవానినగర్ కు చెందిన విజయ గుండెకు సంబంధించిన పలు సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో అయితే వారి యొక్క ఆర్థిక స్థితులు బాగలేక వారు వారి యొక్క కుటుంబసభ్యులు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుదీర్ రెడ్డిని సంప్రదించారు.వెంటనే స్పందించిన సుదీర్ రెడ్డి అట్టి ఆపరేషన్ కు కావలసిన డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిదికి దరఖాస్తు చేయడం జరిగింది.దానికి గాను వారికి 2,00,000(రెండు లక్షల రూపాయలు) ఎల్.ఓ.సీ.చెక్కు మంజూరు కావడం జరిగింది.ఈ సందర్భంగా సుదీర్ రెడ్డి మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు సీ.యం.సహాయనిధి దోహదపడుతుంది అని అన్నారు.ఈ పథకం పేదలకు ఓ వరం లాంటిది అని అన్నారు.పేద ప్రజలకు నాణ్యమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు సీ.ఎం.సహాయనిది అండగా ఉంటుంది అని అన్నారు.

## ఇందిరా పార్క్ ధర్నాకు బయలుదేరిన నాయి బ్రాహ్మణులు

**యాదాద్రి జిల్లా:రామన్నపేట: తోవ్వ ప్రతినిధి: జూన్ 17**



తెలంగాణ నాయి బ్రాహ్మణుల ఉచిత కరెంట్ పెండింగ్ బిల్లులు వెంటనే ప్రభుత్వం చెల్లించాలని కోరుతూ మంగళ వారం జరిగే ఇందిరాపార్క్ ధర్నా కు రామన్నపేట నాయి బ్రాహ్మణులు బయలుదేరి వెళ్ళారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు రాపర్తి గణేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత కరెంటు బిల్లులు వెంటనే విడుదల చేయాలని, ఉచిత విద్యుత్ పథకం ఎల్ టి -2 కేటగిరి నుండి ఎల్ టి-4 కేటగిరిగా మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దోమలపల్లి అంజయ్య, వేముల మల్లేశం, జంపాల రాము, రాపర్తి రవి, రాచకొండ రాజేష్ కుమార్, దడకోజు నాగరాజు, రాచమల్ల శ్రీకాంత్ ఉన్నారు.

### బయ్యారం పెద్ద చెరువులో రాత్రి వేళ

# అక్రమ మట్టి తోలకాలు..

## శని,ఆదివారం అయితే చాలు మట్టి అక్రమార్కులకు పండగే

- చెరువు దగ్గర ఎత్తయినా ప్రదేశంలో గుట్టలుగా మట్టి డంపులు ఏర్పాటు

- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి - చోద్యం చూస్తున్న సంబంధిత శాఖ అధికారులు







**బయ్యారం, తోవ్వ,జూన్ 16**
మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో నామాలపాడు పరిధిలో ఆదివారం రాత్రి బయ్యారం పెద్ద చెరువు మట్టి కొంతమంది ఇటుక బట్టి వ్యాపారులు మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారుల నుండి ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని అక్రమంగా తొలకాలు సాగిస్తున్నారు.బట్టి యజమానులు వక్రమార్గంలో ప్రభుత్వ ఆదాయానికి రాయాల్టికి గండి కొడుతూ శనివారం, ఆదివారం రాత్రి వేళల్లో నిబంధనలు ఏవి మాకు లేవంటూ రాజు మార్గంలో రాత్రి వేళలో బయ్యారం పెద్ద చెరువులో మట్టిని రెండు జేసిబి యంత్రాల సహాయంతో మట్టి తొవ్వుతూ చెరువు పక్కనే ఉన్న మెట్ట ప్రాంతంలో మట్టిని గుట్టలుగా,డంపులుగా నిలువ చేసుకుంటున్నారు.దీని ద్వారా మైనింగ్ శాఖకు రావాల్సిన రాయాల్టీ లక్షల రూపాయిలకు గండిపెడుతున్నారు.అక్రమ మట్టి తోలకాలు అరికట్టవలసిన అధికారులు మీనా వేషాలు లెక్కడుతూ మాకేమీ పట్టవంటూ అక్రమ మట్టి తోలకాలపై కన్నెత్తి చూడకపోవడంపై మండల ప్రజలలో స్థానికులలో పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. మండలంలో సుమారుగా 30 నుంచి 40 ఇటుక బట్టీలు తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి.వీటిలో కొన్ని బట్టీల యజమానులు,తమ రాజకీయ పలుకుబడి తో ఎటువంటి అనుమతి లేకుండా,తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.బట్టి వ్యాపారులు తమ మట్టి కోసం అనుమతుల లేకుండా చెరువు శిఖం భూములలో కొంతమంది ఎటువంటి సేద్యం చేయకున్నా గతంలో రెవెన్యూ అధికారులు సుమారుగా వందల మంది రైతులకు,నామలపాడు,రాయకుంట చెరువు, ముందు కొత్తగూడెం, సుద్దరేవు, కిష్టాపురం, కాచన పల్లి, మూలపోచారం గ్రామాల రైతులకు సాగు పట్టాలు ఇచ్చి ఉన్నారు.ఇదే అదునుగా భావించి శిఖం భూములలో సేద్యం కానీ భూములను రికార్డులలో చూపెట్టి మైనింగ్ శాఖ ద్వారా మట్టి అనుమతులు పొంది,తమకు కావలసిన మట్టిని మైనింగ్ శాఖకు రాయాల్టీ ద్వారా క్యూబిక్ మీటర్ కి 45 రూపాయలు చొప్పున మీ సేవ ద్వారా ఆన్లైన్ ద్వారా చెల్లించి మట్టిని తరలిస్తున్నారు.ఇంతవరకు బాగానే ఉన్నా, కొంతమంది నిబంధనలకు తూట్లు పొడుస్తూ,మైనింగ్ శాఖ,రెవిన్యూ,ఐబి శాఖ అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నారు.

**గుట్టలుగా మట్టి డంపులు..!**
చెరువులో మట్టిని పలుచోట్ల డంపులుగా నిలువ చేసిన మట్టి సుమారుగా 1500 నుండి 2000 ట్రాక్టర్ ల మట్టి డంపులుగా నిల్వ చేసి, నిలువచేసిన మట్టి ని బట్టి యజమానులు, తమ తమ భట్టిలలో ఉన్న మట్టి వాడకం తర్వాత,నిల్వ చేసిన మట్టిని (డంపులను) అన్ సీజన్ టైములో ట్రాక్టర్ లతో వారి,వారి బట్టీలకు తరలించనున్నట్లు స్తానికులు ఆరోపిస్తున్నారు.

**ఇరిగేషన్ అధికారి కృష్ణ వివరణ కోరగా....**
బయ్యారం చెరువు మట్టి అనుమతులపై ఇరిగేషన్ శాఖ ఎటువంటి అనుమతులను మంజూరు చేయలేదు.చెరువు శిఖం భూములలో గతంలో రెవెన్యూ అధికారులు మట్టి కోసం రైతుల పట్టా శిఖం భూములలో మట్టి అనుమతులు ఇచ్చారు.మట్టి విషయంపై మాకేమి సంబంధం లేదు.

**మహబూబాబాద్ జిల్లా మైనింగ్**
**అధికారి వెంకటరమణను వివరణ కోరగా..**
బయ్యారం చెరువు మట్టి అక్రమ తోలకాలపై వివరణ కోరగా మే 14 నుండి మే 30 వరకు నామాలపాడు ఇటుక బట్టి వారు ఏడుగురు మాత్రమే మా నుండి అనుమతి తీసుకుని ఒక్కొక్కరు 300 నుండి 500 క్యూబిక్ మీటర్లకు మాత్రమే ఆన్ లైన్ ద్వారా అనుమతి పొంది మట్టి తీసుకున్నారని,ఈ మధ్యకాలంలో ఎవరికి మా శాఖ నుండి మట్టి అనుమతులు మంజూరు చేయలేదు. ఎవరైనా రాత్రి సమయంలో చెరువు శిఖం భూమిలో అక్రమ మట్టి తోలకాలు చేసినట్లయితే,వారి అక్రమ డంపులను క్షేత్రస్థాయిలో పరిశీలించి,చర్యలు తీసుకునేందుకు,తాహశీల్దార్ కు ఉత్తర్వులు ఇవ్వడం జరుగుతుందని దీనిపై రెవెన్యూ ,పోలీస్,ఇరిగేషన్ శాఖలు సంయుక్తంగా రైడింగ్ నిర్వహించి,యాక్షన్ తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

**బయ్యారం మండల తాహశీల్దార్ నాగరాజు వివరణ కోరగా...**
బయ్యారం పెద్ద చెరువు పరిధిలో ఈ సంవత్సరం జూన్ 1 నుండి నేటి వరకు ఎవరికీ శిఖం రైతులు పట్టా భూముల నుండి మట్టి అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోలేదు.ఎవరు మట్టి అనుమతులు పొందలేదు.ఎవరైనా అక్రమ మట్టితోలకాలు నిర్వహిస్తే,రెవిన్యూ యాక్ట్ ప్రకారం, వాహనాలను సీజ్ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.






# నరేంద్ర మోడీ 11 ఏళ్ల పాలన, బిజెపి కార్యశాల




**యాదాద్రి జిల్లా: వలిగొండ: తోవ్వ ప్రతినిధి :జూన్ 17**
భారతీయ జనతా పార్టీ నరేంద్ర మోడీ 11 ఏళ్ల పరిపాలన పైన వికసిత్ భారత్ అమృతకాలం అనే కార్యక్రమం పైన కార్య శాల వలిగొండ మండల శాఖ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ మండల కన్వీనర్ లోడే లింగస్వామి అధ్యక్షతన మంగళవారం స్థానిక సాయి గణేష్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు శ్రీ పాశం భాస్కర్ హాజరైనారు. వారు మాట్లాడుతూ నరేంద్ర మోడీ 11 సంవత్సరాల పరిపాలన గ్రామాలు, సుభిక్షంగా కేంద్ర ప్రభుత్వ నిధులతోటి అభివృద్ధి పథంలో ముందుకెళ్తున్నాయని, రైతులకు, మహిళలకు , అనేక రకాల కుల వృత్తుల వారికి మోడీ గారి సంక్షేమ ఫలాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలియజేశారు. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు చెప్పడం తప్ప చేతలు ఏమాత్రం చేయడం లేదని వారు తీవ్రంగా విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వం చేసినటువంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బిజెపి అత్యధిక స్థానాల్లో విజయం సాధించాలని అందుకుగాను కార్యకర్తలు శక్తి వంచన లేకుండా పని చేయాలని వారు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల పార్టీ అధ్యక్షులు శ్రీ బోళ్ల సుదర్శన్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ బూత్ అధ్యక్షులు కార్యకర్తలు రోజువారి కార్యక్రమ ప్రణాళికలు తయారు చేసుకొని ప్రజల్లోకి మోడీ సంక్షేమ కార్యక్రమాలను తీసుకెళ్లాలని వారు కార్యకర్తలకు తెలియజేశారు. అదేవిధంగా వివిధ గ్రామాల నుండి బిజెపి పార్టీలో కార్యకర్తలు జైన్ కావడం జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సీ ఎన్ రెడ్డి , వికసిత్ భారత్ జిల్లా కన్వీనర్ ఏల చంద్రశేఖర్ , జిల్లా నాయకులు కొప్పుల యాది రెడ్డి , రాచకొండ కృష్ణ, బంధారప రాములు ,కందుల తానేష, మందుల లక్ష్మి, బొడిగె ఆనంద్, బ చ్చు శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ మైసొల్ల మచ్చగిరి, రేగూరి అమరేందర్, వికసిత్ భారత్ మండల కో కన్వీనర్ మందడి రంజిత్ రెడ్డి, గంగాధర్ దయాకర్, మందుల నాగరాజు, ఎదురుగట్ల వెంకటేశం, వివిధ మోర్చాల అధ్యక్షులు చిన్నం అంజమ్మ, కొత్త రామచంద్రం, పిన్నింటి నరేందర్ రెడ్డి, మీసాల స్వామి, ఎర్రబోలు జంగయ్య, కీర్తి వెంకటేశం, రాధారం మల్లేష్, చెరుకదానయ, రేగు శ్రీధర్, పోల్ నాగయ్య వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు కార్యకర్త లు పాల్గొన్నారు.

## ఘనంగా సమ్మిలిత విద్యాదినోత్సవం

**ముఖ్య అతిధి గా పాల్గొన్న మండల విద్య శాఖ అధికారి లచ్చి రాం నాయక్**



**తొవ్వ, మహబూబాబాద్. జూన్ 17**
జయశంకర్ బడి బాటలో భాగంగా ఎంపీ యూపీఎస్ ఉప్పరగూడెం లో మంగళవారం సమ్మిళిత విద్యా దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ గుగులోత్ సురేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం లో ముఖ్య అధితిగా సీరోలు మండల విద్యాశాఖ అధికారి లచ్చిరాం హాజరై ప్రత్యేకవసరాల విద్యార్థులకు అందించాల్సిన విద్యా ప్రమాణాలు, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు, ఈ సందర్భంగా ఎం ఈవో మాట్లాడుతూ సమ్మిలిత విద్యా భోధన లో భాగంగా ప్రత్యేక అవసరాల విద్యార్థులకు సామానంగా అందరివలె విద్యా భోధన చేస్తూ వారి అభ్యున్నతికి ప్రతీ టీచర్ సహకరించి,మంచి భవిష్యత్తు అందించాలని అదే మన ప్రభుత్వ లక్ష్యంగా జిల్లా కలెక్టర్ అద్వై త్ కుమార్ సింగ్,జిల్లా విద్యా శాఖాధికారి డా. రవీందర్ రెడ్డి ఆదేశాలతో ఈ కార్యక్రమం సీరోలు మండలంలో ప్రారంభించుకొని విద్యాభోధన ప్రారంభించామని తెలిపారు.ఈకార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యా యురాలు అరుణశ్రీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సాయి పల్లవి ఆసుపత్రి పై చర్యలు తీసుకోవాలి

**సాయిపల్లవి హాస్పిటల్ యాజమాన్యంపై డియం అండ్ హెచ్ఓ కు ఫిర్యాదు**

**పేషంట్ ల డబ్బులని రక్తం ల పీలిస్తున్న జలగలు**

**బిఆర్ఎస్ జిల్లానాయకులు జెర్రిపోతుల వెంకన్న గౌడ్**



**తొవ్వ ప్రతినిధి. జూన్ 17**
మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నెహ్రూసెంటర్ లో ఉన్న సాయిపల్లవి హాస్పిటల్ పై జిల్లా వైద్య శాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకో వాలని పేషంట్ల డబ్బులని రక్తంల పీలిస్తు జలగల వ్యవహరిస్తున్న సాయి పల్లవి హాస్పిటల్ యాజమాన్యం కఠిన చర్యలు పునుకోవాలని జిల్లా బిఆర్ఎస్ నాయకులు జెరరిపోతుల వెంకన్న గౌడ్ అన్నారు. మంగళవారం జిల్లా వైద్య శాఖ అధికారికి సాయి పల్లవి హాస్పిటల్ పై పిర్యాదు చేసి వివరాలు వెల్లడిస్తూ ముడుపుగల్ గ్రామానికి చెందిన బయ్య గంగమ్మ అనే మహిళ చికిత్స కోసం వస్తే చికిత్స చేసివారంరోజుల్లో లక్షల రూపాయలు అడ్డగోలుగా తీసుకున్నారని, వ్యాధిని తగ్గించగపోగా భార్య భర్తలను అసభ్య పదజాలంతో దూషించారని ఆరోపిం చారు ఆ..దంపతుల నిర్ణయం మేరకు జిల్లావైద్యాధికారిని కలిసి సమస్య ను వివరించి, వినతి పత్రం అందజేసారు. విచారణ జరిపి హాస్పి టల్ యాజమాన్యంపై వెంటనేతగినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

## రోడ్డు ఎక్కితే సీజ్..

**అనుమతులు లేకుండా ఇసుక తోలితే కఠిన చర్యలు**

**కూపన్ లు ఉంటేనే ఇసుక తోలాలి**

**రెవెన్యూ ఇన్స్పెక్టర్ నెల్లూరి రవికుమార్**




**తొవ్వ, ప్రతినిధి,కురవి జూన్ 17**
తాసిల్దార్ అనుమతులు లేకుండా ఇసుక తోలకం చేస్తే టాక్టర్ సీజ్ చేసి మైనింగ్ యాక్ట్ ప్రకారం చర్యలు ఉంటాయని రెవెన్యూ ఇన్స్పెక్టర్ నెల్లూరు రవికుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నేరడ నుంచి కురవికి ఇసుకలోడుతో వస్తున్న ట్రాక్టర్ టీఎస్ 26 టి 1586 నెంబరు గల ట్రాక్టర్ ను పట్టుకొని ఎస్సై గంద్రాతి సతీష్ కు అప్పగించినట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అక్రమ ఇసుక వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటున్న తరుణంలో కొరవి మండల పరిధిలో తాసిల్దార్ అనుమతులు లేకుండా ఇసుక తోలితే చట్టరీత్యా నేరమని అన్నారు. ఇసుక లోడుతో పట్టుబడితే మైనింగ్ యాక్ట్ ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు.

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

**తొవ్వ,గార్ల జూన్17**



భార్య అనారోగ్యంతో ఉండడం, ఆర్థికపరిస్థితులు బాగోలేకపోవడంతో గార్ల మండలంలోని తిర్లపురం గ్రామానికి చెందిన మలోత్ శ్రీనివాస్ (46) ఆత్మహత్య చేసుకుని మృతిచెందినట్టు ఎస్సై రియాజ్ పాషా తెలిపారు. మృతుడు శ్రీనివాస్ భార్య జ్యోతి అనారోగ్యంతో ఉండడంతో ఆమెను చూడలేక మనోవేదనకు గురై ఆర్థిక ఇబ్బందులను తలుచుకుంటూ కొంతకాలంగా దిగులుచేందుతూ ఇంట్లో ఎవరూ లేనిసమయం చూసి చీరతో ఫ్యాన్ కు ఉరివేసుకుని అహ్మహత్య చేసుకున్నారు ఆయన తెలిపారు. మృతుని అన్న మలోత్ శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఫైఆర్ నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

# జూన్ 30న జిఎంపిఎస్ రామన్నపేట మండల సదస్సు

### జిఎంపిఎస్ జిల్లా కార్యదర్శి ప్రధాన కార్యదర్శి మద్దెపురం రాజు



**యాదాద్రి జిల్లా : రామన్నపేట: తోవ్వ ప్రతినిధి: జూన్ 17**
గొల్ల కురుమ నిరుద్యోగ యువత గొర్రెల ఫామ్స్ పెట్టుకొని ఆర్థికంగా ఎదిగేందుకు ప్రత్యేక రుణాలు మంజూరు చేయాలని గొర్రెలు మేకల పెంపకందార్ల సంఘం(జీఎంపీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెపురం రాజు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం రామన్నపేట మండల కేంద్రంలో జిఎంపిఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది.ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ స్కీములో నిబంధనలు సులభతరం చేసి గొల్ల,కురుమ యువతకు గొర్రెల ఫామ్స్ ఏర్పాటు చేయాలని,దరఖాస్తులు లబ్దిదారుల నుండి నేరుగా స్వీకరించాలని డిమాండ్ చేయాలని డిమాండ్ చేశారు.బ్యాంకు స్యూరిటీ కాకుండా సొసైటీల జమానతుతో సభ్యులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు దయ్యాల నర్సింహ్మా మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో గొల్ల కురుమలకు రెండు లక్షల రూపాయల నగదు బదిలీ చేస్తామని అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఓడ ఎక్కేదాకా ఓడ మల్లయ్య,ఒడ్డెక్కినంక బోడ మల్లయ్య అన్న రీతిగా వ్యవహరిస్తుందని విమర్శించారు.ఇప్పటికైనా గొల్ల కురుమ యువతకు గొర్రెల ఫార్మ్స్ ఏర్పాటు కోసం ప్రత్యేక రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.లేనియెడల గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు.గొర్రెల మేకల పెంపకం దారుల సమస్యల పరిష్కారం కోసం జూన్ 30న రామన్నపేటలో నిర్వహిస్తున్న గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం మండల సదస్సుకు సంఘం నాయకులు,సభ్యులు,గొల్ల కురుమలు,గొర్ల కాపర్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం 8చేయాలని కోరారు.ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు కల్లూరి నగేష్,నాయకులు గొరిగె సోములు,కంకల శేఖర్,తీర్పాల మల్లేశం,గోగు లింగస్వామి,సాగర్ల శేఖర్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ యువనేత” ఆకుతోట సతీష్ “ప్రజాసేవ చేస్తున్న తీరు ప్ర శంసనీయం

- ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్
- జన్మదినం పురస్కరించుకొని బాణాసంచా పేల్చి, స్వీట్లు పంచి కాంగ్రెస్ నేతల సంబరాలు
- 300 మందివిద్యార్థినీ విద్యార్థులకు బుక్స్ స్టేషనరీ, షూస్ అందజేత - పేద విద్యార్థులకు ఆర్థిక చేయూత






**తొవ్వ, నెల్లికుదురు, జూన్ 17**
కాంగ్రెస్ యువ కిశోరం, ప్రజాసేవ లక్ష్యంగా భావిస్తూ పార్టీలో తనదైన శైలిలో అందరికీ తలలో నాలుకలాగా ఉంటూ సేవ చేస్తున్న ఆకుతోట సతీష్ ప్రజాసేవ ప్రశంసనీయమని, భవిష్యత్తులో ఉన్నత పదవులు పొందాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నేత ఆకుతోట సతీష్ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా భారీగా బాణాసంచా పేల్చి కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తోపాటు జిల్లా నేతలు కాసం లక్ష్మారెడ్డి, గుగులోతు బాలాజీ నాయక్, కాసం రంజిత్ రెడ్డి, లతో కలసి పూల బొకే అందించిశాలువాతో సత్కరించి కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ క్రమంలోనే మండల కేంద్రం తోపాటు రామన్నగూడెం యుపిఎస్ లో పాఠశాలలోనీ 300 మంది పేద విద్యార్థిని విద్యార్థులకు నోట్ బుక్స్, స్టేషనరీ, షూస్ అందజేయడంతోపాటు పేద విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత రాజకీయాల్లోకి రావాలని ప్రజాక్షేత్రంలో నిలవాలని కోరారు.. సతీష్ అనతి కాలంలోనే పేదల ప్రజల మన్ననలు పొందారన్నారు. పార్టీ కోసం పేద ప్రజల సంక్షేమం కోసం ఆయన అందిస్తున్న తీరు ప్రశంసనీయమన్నారు. భవిష్యత్తులో ఉన్నత పదవులు పొంది ప్రజాక్షేత్రంలో మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ జేల్ల వెంకటేష్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ జిలకర యాలాద్రి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మరి కుంట్ల మౌనేందర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మద్ది రాజేష్ పటేల్, పిఎసిఎస్ డైరెక్టర్ రావుల సతీష్, నేతలు గంకిడి ఎల్లారెడ్డి, వెన్నం క్రాంతి రెడ్డి, ఇట్టే దేవేందర్ రెడ్డి, కాసం సుధాకర్ రెడ్డి,బొల్లు లింగమూర్తి, పెరుమాళ్ళ శంకర్ గౌడ్, గడ్డమీది వేణు కుమార్, మాదరి ప్రశాంత్, సలుగు వీరేష్, తదితరులున్నారు.

# ఫిబ్రవరిలో నియామకమైన 2008 డీఎస్సీ ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలి

**ఐదు నెలలుగా అందని జీతాలు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉద్యోగులు**

**2008 డిఎస్సి లో సెలెక్ట్ అయి డీ.ఎడ్ రిజర్వేషన్ తో నియామకం నిలుపుదల**

**కోర్టు నాశ్రయించిన బాధితులు, ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఓర్చి పదిహేను సంవత్సరాల సుదీర్ఘ పోరాటం**

**కోర్టు అనుకూల తీర్పుతో కాంట్రాక్టు ఉద్యోగం ఇచ్చి తీరని అన్యాయం చేసిన ప్రభుత్వం.**

**ఐదు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం సమంజసం కాదు**

**తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్.**



**తొవ్వ, కేసముద్రం, జూన్ 17:** ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో నియామకమైన డీఎస్సీ 2008 కాంట్రాక్టు ఉపాధ్యాయులకు నియామకమైన నెల నుండి నేటి వరకు ప్రభుత్వం జీతాలు ఇవ్వలేదని, తక్షణమే ప్రభుత్వం వారికి జీతాలు చెల్లించేలాగా తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్, డిమాండ్ చేశారు.కేసముద్రం విలేజ్ ప్రాథమిక పాఠశాలలో భోజన విరామ సమయంలో టి పి టి ఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో నిరసన తెలిపిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ సంఘ మండల శాఖ అధ్యక్షులు సురేందర్ మాట్లాడుతూ డీఎస్సీ 2008లో సెలెక్ట్ అయి,నియామకం పొందే సమయంలో డి.ఎడ్ వారికి 30% రిజర్వేషన్ ఇవ్వాలన్న నిర్ణయంతో ఈ నియామకం ఆగిపోయిందని, ఈ విషయమై ఎన్నిసార్లుమొరపెట్టుకున్న ప్రభుత్వం వీరికి ఉద్యోగాలు ఇవ్వలేదని అన్నారు. విధి లేని పరిస్థితుల్లో వీళ్ళు కోర్టు ను ఆశ్రయించి, ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి 15 సంవత్సరాలుగా పోరాటం చేశారని వివరించారు. చివరకు వీరికి అనుకూలంగా కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించి ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో వీరిని రెగ్యులర్ ఉపాధ్యాయులుగా కాకుండా కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా నియమించి వారికీ తీరని అన్యాయం చేశారని ఆయన వాపోయారు. ఈ పదిహేను సంవత్సరాలు వారు ఎంతో మనోవేదనకు గురయ్యారని, శారీరకంగా ఆర్థికంగా వారు ఎంతో నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో వీరికి కాంట్రాక్టు ఉద్యోగాన్ని అంటగట్టిన ప్రభుత్వం నియామకమైన ఫిబ్రవరి నెల నుండి నేటి వరకు సుమారు ఐదు నెలలుగా జీతాలు కూడా ఇవ్వడం లేదని, ఎందుకీ వివక్ష అని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వీరంతా ఐదు నెలలుగా తమ విధులు నిర్వర్తిస్తూనే ఉన్నారని, కానీ జీతాలు రాక ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకు పోయారని అన్నారు. ప్రభుత్వం వీరికి జీతాలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం సమంజసం కాదని హితువు పలికారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి వారికి జీతాలు ఇవ్వడానికి అవసరమైన చర్యలు తక్షణమే తీసుకోవాలని సురేందర్, డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ కార్యదర్శి వీసం నర్సయ్య, ఉపాధ్యాయులు అప్పాల నాగరాజులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ విద్యార్థినికి నీట్‌లో 100 వ ర్యాంక్.. డీఐఈఓ అభినందన..

**తొవ్వ .జూన్ 17.నల్గొండ:**



శనివారం విడుదలైన నీట్ ఫలితాల్లో నల్లగొండ పట్టణం చర్లపల్లిలోని ఎస్ ఆర్ కళాశాల విద్యార్థిని బచ్చు ప్రియాంక ఆలిండియా స్థాయిలో 100వ ర్యాంకు సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మంగళవారం డీఐఈఓ దస్రూనాయక్ ఎస్ ఆర్ కళాశాలకు విచ్చేసి జోనల్ ఇన్‌చార్జి దోనాల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి విద్యార్థిని ప్రియాంకను సన్మానించారు. అదే విధంగా ఆమె తల్లిదండ్రులను అభినందించారు. ప్రియాంక తోపాటు నల్గొండ బ్రాంచ్ లో మెడిసిన్ ర్యాంక్ సాధించిన పావని, లేఖన, ప్రవల్లిక,జ్యోతి,గాయత్రి,దివ్య ధరణి లను వల్ల తల్లీ దండ్రులను చలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం డీఐఈఓ మాట్లాడుతూ కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు ఎదుగాలని ఆకాంక్షించారు. ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఏనగందుల వరదారెడ్డి, డైరెక్టర్ సంతోశ్‌రెడ్డి, సీఈఓ సురేందర్‌రెడ్డి, నల్లగొండ బ్రాంచ్ అసిస్టెంట్ జోనల్ సతీశ్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు మనోజ్ రెడ్డి, డీన్ కిషోర్ బాబు, ఏఓ సరితారెడ్డి , అధ్యాపకులు వర్ధన్, ప్రసన్న, శ్రీనివాస్,శోభ విద్యార్థులను.. అభినందించారు.

## ఆత్మ చైర్మన్ సన్మానించిన పిచ్చిరెడ్డి

**రైతులకు సకాలంలో ఎరువులు అందేటట్టు చూడాలి**

**టిఆర్ఎస్ సీనియర్ నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి**



**కురవి జూన్ 17 (తొవ్వ న్యూస్)**
మరిపెడ డివిజన్ ఆత్మ చైర్మన్ సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి టిఆర్ఎస్ సీనియర్ జిల్లా నాయకులు బజ్జూరీ పిచ్చిరెడ్డి స్వగృహానికి రాగా దుశాల్వా కప్పి ఆయనను ఘనంగా సన్మానించారు. మంగళవారం మండలంలోని అయ్యగారి పల్లి గ్రామానికి చెందిన సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మరిపెడ డివిజన్ ఆత్మ చైర్మన్ సుధాకర్ రెడ్డి స్వగ్రామానికి రాగ టీఆర్ఎస్ సీనియర్ జిల్లా నాయకులు బజ్జూరీ పిచిరెడ్డి సాదరంగా తన గృహానికి ఆత్మ చైర్మన్ ను ఆహ్వానించి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత రైతాంగానికి సకాలంలో ఎరువులు అందేటట్లు చూడాలని కోరారు. సబ్సిడీలో వచ్చిన వ్యవసాయ పరికరాలను అర్హత కలిగిన రైతులకు ఇవ్వాలని ఆయన సూచించినట్లు తెలిపారు. ఆత్మ చైర్మన్ వెంట సిపిఐ మండల కార్యదర్శి కరణం రాజన్న. కొరవి టౌన్ కార్యదర్శి తురక రమేష్. వెంకన్న. తదితరులు ఉన్నారు.

## కేసముద్రం మండల టిడిపి పార్టీ నూతన కమిటీ ఎన్నిక

**టిడిపి మండల పార్టీ అధ్యక్షునిగా ఏశబోయిన ఎల్లయ్య**

**ప్రధాన కార్యదర్శిగా బోడకుంట్ల సత్యనారాయణ**



తొవ్వ, కేసముద్రం, జూన్ 17: కేసముద్రం మున్సిపాలిటీలోని హరిహర గార్డెన్ ఫంక్షన్ హాల్ లో మంగళవారం మహబూబాబాద్ పార్లమెంట్ అడహక్ కమిటీ కన్వీనర్ గా కొండపల్లి రామచందర్ రావు అధ్యక్షత వహించగా రాష్ట్ర టిడిపి పార్టీ పరిశీలకులుగా యనాల అనంతరెడ్డి హాజరై కేసముద్రం టిడిపి మండల పార్టీ ఎన్నికలను నాయకుల, కార్యకర్తల మధ్య ఏకగ్రీవ ఎన్నిక నిర్వహించారు. కేసముద్రం టిడిపి మండల పార్టీ అధ్యక్షునిగా ఏశబోయిన ఎల్లయ్య ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర టిడిపి పార్టీ ఉపాధ్యక్షులు బండి పుల్లయ్య,రాష్ట్ర మాజీ కార్యదర్శిలు ఎం డి. ఇమామ్, వెంకటనారాయణ, మహబూబాబాద్ పార్లమెంటు మాజీ అధికార ప్రతినిధి ప్రేమ్ చంద్,కొరివి మండల పార్టీ అధ్యక్షుడు వీరస్వామి, మహబూబాబాద్ మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మ వెంకటేశ్వర్లు హాజరైనారు. అదేవిధంగా మండల పార్టీ ఉపాధ్యక్షులుగా యాసారపు నరసయ్య,ప్రధాన కార్యదర్శిగా బోడకుంట్ల సత్యనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శులు గూడేలు ముత్తయ్య,గుగులోత్ లక్ష్మణ్,భూక్య లచ్చిరాం, కార్యదర్శులుగా ఆవుల సారయ్య,షేక్ దలాల్ షరీఫ్, కోశాధికారిక గుర్రాల స్వరూపాలను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షులుగా ఎన్నికైన యశోబోయిన ఎల్లయ్య మాట్లాడుతూ... మండల కేంద్రంలో టిడిపి పార్టీని మరింత బలోపేతం చేసి అభివృద్ధి దిశగా నడిపిస్తూ రానున్న స్థానిక ఎన్నికలలో టిడిపిని మంచి స్థానంలో నిలిపేలా కృషి చేస్తానని నా ఎన్నికకు సహకరించిన రాష్ట్ర జిల్లా మండల నాయకులకు కార్యకర్తలకు ప్రత్యక్ష కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు.

## భార్యను హతమార్చిన భర్త

**నెల్లికుదురు, జూన్ 17 :**



మద్యం మత్తులో బార్యను గొంతునులిమి హత్య చేసిన ఘటన సోమవారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. తోర్రూరు సీఐ గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని హేమ్లాతండా గ్రామ పంచాయతీ పరిధిలోని ఇస్రాతండాకు చెందిన బానోత్ భద్రు సోమవారం రాత్రి మద్యం మత్తులో తన భార్య బానోత్ రంగమ్మ (55) నిద్రిస్తున్న సమయంలో గొంతు నులిమి హత్య చేశాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేసినట్లు సీఐ తెలిపారు. మృతురాలి కూతురు వాంకుడోత్ శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146